
"**అన్నట్టు** — మరిచే పోయాను. మీరు వూరెళ్ళిన మరునాడు కనకరాజు వచ్చాడండీ. వాళ్ళ తమ్ముడి మీద ఏదో ఖూనీ కేసు ఉందిట గదా ఎల్లుండి హైదరాబాదులో? ఆ వేళకు మీరు వస్తారో, రారో అని బెంబేలు పడి పోతున్నాడు." సగం వంట చేస్తూ మధ్యలో జ్ఞాపకం వచ్చి హాలులో పేపరు చూస్తున్న భర్త గంగాధరశాస్త్రితో చెప్పింది అన్నపూర్ణమ్మ.

"అందుకే సుప్రీంకోర్టులో నాయుడు పోట్లాట కేసు నెల రోజులు వాయిదా తీసుకుని వెంటనే ఫ్లైటు అందుకుని వచ్చేశాను."

"అవతల పార్టీకి మంచి సాక్ష్యం ఉందిట కదా? చెప్పుకుని ఏడుస్తున్నాడు."

"మరేం ఫరవాలేదు. వీడి వైపు పాయింట్సు బలంగానే ఉన్నాయి."

"హమ్మయ్య! వచ్చేశారూ? దేవీ నవరాత్రుళ్ళు దగ్గర పడుతున్నాయి. . . మీరు ఊర్లో లేరు. ఎలాగా అని. . ." చంకలో పంచాంగం, చేతిలో




పొడుం డబ్బాతో ప్రత్యక్షమయ్యాడు శాస్త్రులు.

"దయచేయండి, శాస్త్రులుగారూ! ఈ సారి దసరా పండగలు బాగా జరగాలి. భాగవతులగారిచే నవరాత్రులు హరికథ పెట్టించండి. వెయ్యినూట పదహార్లు ఇచ్చి ఘనంగా సత్కారం చేద్దాం. నవమినాడు బీదలకు సంతర్పణ ఏర్పాటు చెయ్యండి. నేను రేపు హైదరాబాదు వెళ్ళి, కేసు అయిపోగానే వచ్చేస్తాను. ఏర్పాట్లకు కావలసిన డబ్బు ఇంట్లో అడిగి తీసుకోండి."

"ఈసారికూడా ఘనాపాఠీలు, పండితులు ఎక్కడెక్కడి నుండో మీ పేరు విని ఇక్కడకు నవరాత్రులకు రావటానికి ఉత్సాహం చూపుతున్నారు."

"వారి నందరిని మనమే ఆహ్వానిద్దాం. రోజూ ఉదయం వారి చేత వేదపఠనం పెట్టిస్తే మన ఊరి కెంతో మేలు కలుగుతుంది. వారిని ఎలా సత్కరిస్తే బాగుంటుందో ఆలోచించి చెప్పండి."

"బాబూ! మీ అండ ఉంటే తక్కిన పనులు అన్ని నేను చూసుకుంటాను గదా?"

"గంగాధరశాస్త్రీ! ఢిల్లీ వెళ్ళావుట కదా? జడ్జి అనంతరావు నీ గురించి పదిసార్లయినా కబురు పెట్టాడు. సెంట్రల్ గవర్నమెంటు అడిగిన రిపోర్టు తయారు చెయ్యాలిట. నీ సలహా తీసుకుందామని . . ." తోటి లాయరు విశ్వనాథం గంగాధరశాస్త్రితో సాయంకాలాలు కబుర్లు చెప్పుకోవటానికి వస్తూంటాడు.

"అలాగా? రేపే అతన్ని కలుస్తాను. ఇంకేమిటి సంగతులు?"

"ఏముంది? ఈ సారి కూడా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో నిన్నే అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి ఆలోచిస్తున్నారు మన లాయర్లంతా."

"చూడు, విశ్వనాథం! బార్ కౌన్సిల్‌ను కొంత కాలం మనం నడిపాం. ఇక ముందు మనం పక్కకు తప్పుకుని యంగ్ లాయర్స్‌కి ఛాన్సు ఇస్తే బాగుంటుంది."

"తక్కిన పదవులకు అలానే చేస్తున్నారు. కాని, అధ్యక్షుడుగా నువ్వే ఉండాలని అంతా పట్టుదల."

● ●

'అమ్మాయీ! స్నానం అయిందా? నాన్నగారూ, అన్నయ్యలూ నీ గురించే చూస్తున్నారు పూజ గదిలో.'

"బట్టలు కట్టుకుని వచ్చేస్తున్నా."

రేడియోలో శనివారం ఒక్క రోజే వెంకటేశ్వర సుప్రభాతం. కాని, గంగాధరశాస్త్రిగారి ఇంట్లో అన్ని దినాలూ ఉదయం ఆరు గంట లయ్యేసరికి అనేక కంఠాలు మేళవించుకుని సుప్రభాతం వినిపిస్తాయి. గంగాధరశాస్త్రి భార్య అన్నపూర్ణమ్మ, పెద్ద కొడుకు రవి, చిన్న కొడుకు శంకర్, అమ్మాయి జ్యోతి—ఉదయాన్నే లేచి కాలకృత్యాలు, స్నానాదులు ముగించుకుని ఆరు గంటలయ్యేసరికి పూజా మందిరంలో చేరతారు. అది రివాజు. తప్పనిసరిగా జరిగే దినచర్య. వెంకటేశ్వర సుప్రభాతమే కాకుండా విష్ణు సహస్రనామాలు, ఆదిత్య హృదయం—ఇలా ఎన్నో భక్తి గీతాలతో పూజామందిరం ఒక గంట పరవశం చెందుతుంది. తరవాత అన్నపూర్ణమ్మ గారు వేరే లక్ష్మీ పూజ చేసుకుంటారు.

ఇంట్లో పూజలే కాకుండా ప్రతి సోమవారం శివాలయంలో రుద్రాభిషేకం, మంగళవారం ఆంజనేయస్వామి వారి గుడిలో అర్చన, లక్ష్మీవారాలు కనకమహాలక్ష్మికి పూజలు, శుక్రవారాలు లలిత గుడిలో సహస్రనామ పూజలు విధిగా జరగవలసిందే!

వినాయకచవితికి, శ్రీరామనవమికి, దసరాకు బయట పెద్ద పెద్ద పందిళ్ళు వేయించి నవరాత్రులు దగ్గర ఉండి పూజలు జరిపిస్తారు గంగాధర శాస్త్రి, అన్నపూర్ణమ్మ. రాత్రిళ్ళు హరికథలు ఏర్పాటు చేస్తారు. పగటి పూట పురాణ కాలక్షేపం. బీదలకు అన్న సంతర్పణ. వేద పండితులలకు సగౌరవంగా సత్కారం. ఇవన్నీ గంగాధరశాస్త్రి, అన్నపూర్ణమ్మల ఆధ్వర్యంలో జరుగుతాయి. మూడు వంతుల ఖర్చు గంగాధరశాస్త్రిగారే భరిస్తారు. ఈ వేడుకలను చూడటానికి చుట్టు పక్కల నుండి ప్రజలు వస్తూంటారు.

● ● ●

"బాబయ్యా! అన్యాయంగా మునసబు పోలిగాడి చేత కేసు బనాయించేడు. తాతల నుండి దున్నుకుంటున్న పొలం నాది కాదు, పొమ్మంటున్నాడయ్యా. మీరే రక్షించాలి."

"సర్లే. కాగితాలూ అవీ గుమాస్తా కియ్యి ... రంగనాథం! ఎల్లయ్య దగ్గర పూర్తి వివరా లడిగి నోట్ చేసుకో. కేసు రేపు స్టడీ చేద్దాం."

"అయ్యా! మీ రుణం ఉంచుకోను ... నన్ను రక్షించాలి."

"అలాగే లేరా. ఫీజు ఏమీ ఇవ్వ నక్కరలేదులే. కేసు నేనే నడిపిస్తానులే. మరేం భయంలేదు. వివరాలన్నీ రంగనాథానికి చెప్పి వెళ్ళు."

● ● ●


గంగాధరశాస్త్రి క్రింద అరడజను మంది జూనియర్లు, నలుగురు గుమాస్తాలు ఉన్నారు. ఇంత మందికీ ఊపిరి సలపనంత పని. గంగాధరశాస్త్రి ఆర్జన నెలసరి ఇరవై వేల దాకా ఉంటుంది. హైకోర్టు, సుప్రీంకోర్టు కేసులు తప్పనిసరిగా అతని వద్దకే వస్తాయి. ఇంత ఆర్జన, ఇంత పలుకుబడి ఉన్నా, గంగాధరశాస్త్రి ఎంతో నిరాడంబరంగా, నిర్మలంగా ఉంటాడు. ముఖ్యంగా పేదసాదలకు దేవుడులాంటి వాడు. వాళ్ళు ఇస్తామన్నా, వాళ్ళ వద్ద చిల్లిగవ్వకూడా పుచ్చుకోడు. తను సంపాదించిన డబ్బు సత్కార్యాలకు వినియోగిస్తాడు.

● ● ● ●

"నమస్కారమండీ!" అంటూ హాలులో కూర్చున్న గంగాధర శాస్త్రి, అన్నపూర్ణమ్మలకు పాదాభివందనం చేశాడు ఆ వచ్చిన యువకుడు.

"లే, నాయనా! కూర్చో. ఎక్కడో చూచినట్టుగా ఉంది." గంగాధరశాస్త్రి గుర్తుపట్టలేదు. అన్నపూర్ణమ్మ గుర్తు పట్టింది.

"మోహన్‌వి కదూ? ఎంత మారిపోయావు! ఎక్కడ ఉంటున్నావు? చాలా కాలానికి




_గరిమెళ్ళ వెంకట సీతారాం

నిన్ను చూడ్డం." ఆవిడ ముఖంలో ఎంతో ఆనందం, సంతోషం.

"అవునమ్మగారూ! ఇంజనీరింగు పూర్తి చేశాక స్కాలర్‌షిప్ మీద అమెరికాలో డాక్టరేట్ చేసి తిరిగి వచ్చాను. స్టీల్ ప్లాంటులో మేనేజరుగా పోస్టింగ్ మీద ఈ ఊరు వచ్చాను."

"చాలా మంచివార్త చెప్పావు. ఇదద. ఈ దేవుడి ప్రసాదం నోట్లో వేసుకో."

"అమ్మగారూ! ఆ నాడు మీ రిరువురూ పార్వతీ పరమేశ్వరుల్లా దిక్కులేని నన్ను చేరదీసి, తిండీ బట్టలే కాకుండా జీతంకట్టి, పుస్తకాలు కొని నన్ను చదివించారు. మీ ఋణం ఈ జన్మలో కాదు కదా — ఏ జన్మలోనూ తీర్చుకోలేను."

"అప్పట్లో మాకు పిల్లలు లేరు కాబట్టి నిన్నే మా కుర్రవాడుగా భావించి చదువూ అవీ చెప్పించాము. ఇందులో ఇంత మెచ్చుకోవలసిం దేముంది? నువ్వు మంచి వాడివి. బుద్ధిమంతుడి వి. బాగా చదువుకొన్నావు. వృద్ధిలోకి వచ్చావు." తనను పొగడడం గంగాధరశాస్త్రికి ఇష్టం ఉండదు.

ఇంతలో ఆ ఊరి హెడ్‌మాస్టరు అక్కడికి వచ్చారు.

"రండి, మేస్టారు ... మోహన్ అని —పది పదిహేనేళ్ళ క్రిందట మాట. నేను కొత్తగా ప్రాక్టీసు పెట్టిన రోజుల్లో ... మీ స్కూల్లో అన్నింటిలో ఫస్టు మార్కులు కొట్టేస్తూండే వాడు ... ఇంజనీరింగు చేసి అమెరికా వెళ్ళాడు. ఇప్పుడు ఇక్కడ స్టీల్ ప్లాంటు మేనేజరుగా వచ్చేడు." గంగాధరశాస్త్రి మోహన్‌ను పరిచయం చేశారు.

"ఏమిటీ! ... మన మోహనా? ఎంత మారి పోయాడు! నేను పోల్చలేదు సుమండీ. అయ్యా గంగాధరశాస్త్రిగారూ! దానం చెయ్యటానికి కూడా అర్హత ఉండాలండీ. అప్పుడే అది రాణిస్తుంది. ఆ పోలిపెట్టే కూడా బీద విద్యార్థులకు చదువు చెప్పిస్తున్నాడు. ఏం లాభం? ఒక్కడూ గట్టెక్కలేక డింకీలు కొడుతున్నారు. క్రితం సంవత్సరం మీరు జీతం కట్టిన నలుగురు విద్యార్థులలో ఇద్దరికి మెడికల్, ఇద్దరికి ఇంజనీరింగు సీట్లు వచ్చాయి."

"అవును. వాళ్ళ తల్లి దండ్రులు వచ్చి చెప్పారు. వాళ్ళు ఏ జన్మలోనో సుకృతం చేసుకోబట్టి వాళ్ళ సంతానం వృద్ధిలోకి వస్తున్నారు. మంచివాళ్ళను భగవంతుడు రక్షిస్తాడు. ఇకపైన కూడా నాకు వీలైన సహాయం చేస్తాను, చదువు మాన్పించ వద్దని చెప్పాను."

"గంగాధర శాస్త్రిగారూ ! ఇదంతా మీ చేతి చలవ. మీరు ఎన్నో దైవ కార్యాలు, దానాలు, ధర్మాలు చేస్తున్నారు. మీకు దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడు. మీరు ఏ సత్కార్యం ప్రారంభించినా, అవిఘ్నంగా సాగిపోతుంది— నా మాట నమ్మండి. మీ పేరు చెప్పుకొని ఎంతో మంది వృద్ధిలోకి వస్తున్నారు."

"నమస్కారం, మాస్టారూ! మీ ఆరోగ్యం బాగుందా? అమ్మగారు క్షేమమా?"

కళ్ళద్దాల పైభాగంలోంచి చూశారు మాస్టారూ. ఎదురుగా నవ్వుతూ హుందాగా, వినయంగా నమ్రతగా దండంపెట్టి ఉన్న కుర్రవాడిని చూశారు మేస్టారు.

"మా పెద్దవాడు—రవి. ఇంజనీరింగు అయింది. అమెరికా వెళ్ళాలని ఆత్రత."

"అవునవును. విన్నాను...చాలా సంతోషం, నాయనా! బుద్ధిమంతుడివి. నువ్వు ఇంకా ఇంకా పెద్ద పెద్ద చదువులు చదివి, పెళ్ళి చేసుకొని అమ్మగార్ని, నాన్నగార్ని సుఖ పెట్టగలవన్న నమ్మకం నాకు ఉంది. వా రిరువురు అంతటి ఉన్నతమైన వ్యక్తులు కాబట్టే దేవుడు వారికి మణిపూసల్లాంటి పిల్లలను ప్రసాదించాడు. అన్నట్టు —నిన్ననే జ్యోతి కనబడి చెప్పింది—శంకర్ ఎమ్. బి., బి. ఎస్. ఆఖరి సంవత్సరంలోకి వచ్చాడటగదా? జ్యోతి కూడా ఈ సంవత్సరం కాలేజీలో చేరుతున్నట్టుగ చెప్పింది."

"అవును, మాస్టారూ! అంతా ఆ దేవుడి చలవా, మీ అందరి ఆశీర్వాద బలమూ."

* * * *

అన్నపూర్ణమ్మ ఆ రోజు అలాంటి నిర్ణయం తీసుకొందంటే తెలిసిన వాళ్ళంతా ముక్కుమీద వేలేసుకొని క్వొశ్చన్‌మార్కు మొహాలు పెట్టారు. పెట్టరూ మరి? ముప్ఫయి ఏళ్ళబట్టి అన్నపూర్ణమ్మతో కాపురం చేస్తున్న గంగాధర శాస్త్రికే ఆశ్చర్యం వేస్తే— తక్కిన వాళ్ళకు ఆశ్చర్యం వెయ్యదూ?

* * *

ఆవేళ శ్రావణ శుక్రవారం. కంచి పట్టు చీరల్లో, బెనారస్ పట్టు చీరల్లో, తలంటిన సిగల్లో చామంతి, సంపెంగ, మల్లెల గుభాళింపులతో ముత్తయిదువులు; పట్టు పావడాల్లో కన్నె పిల్లలు హాలంతా కలకలలాడిపోతూంది. వచ్చిన ప్రతి ముత్తయిదువుకు కాళ్ళకు పసుపు పారాణి రాసి, నుదుట కుంకుమ బొట్టు దిద్ది వాయినాలు ఇస్తున్నారు అన్నపూర్ణమ్మగారు. ఎదురింటి మహాలక్ష్మమ్మగారికి వాయినం ఇస్తూంటే ఎదురుగా అప్పుడే హాలులోకి అడుగు పెడుతున్న ఒక నలభై ఏళ్ళ వయసు గృహిణీ, ఆమె పక్కగా పదహారు లేక పద్దెనిమిది ఏళ్ళ కన్నె పడుచు కనపడ్డారు. అన్నపూర్ణమ్మగారు ఆ కన్నెపడుచును చూసి ఒక్కసారి దిగ్భ్రాంతి చెందారు. అన్నపూర్ణమ్మగారే కాదు, హాలు హాలంతా ఒక్క అరనిమిషం నిశ్శబ్దం అయి అందరి దృష్టి ఆ అమ్మాయిపైనే నిలిచింది. ఆ అమ్మాయి చాలా సింపుల్‌గా ఉంది. ఒంటిమీద సింగారం కాని, బంగారం కాని లేదు. కాని, బంగారంకంటే

సాహితీ లోకంలో సంధ్యారాగం! అశేష పాఠకులను విశేషంగా అలరించిన
ఆర్. సంధ్యాదేవి సరికొత్త నవలలు వెలువడినవి!!
శాంతి సిరులు ......11.50
వెండి వెన్నెల .......11.00
సజీవ శిల్పం ......11.00
సిందూర పద్మాలు....11.00
ఎర్ర కలువలు .....10.00
కర్పూర దీపిక ... 8.50
వెన్నెల దీపాలు. ..13.00
అన్ని పుస్తకాల షాపుల్లోనూ దొరుకుతాయి.
లేదా పుస్తకాల ఖరీదులో 1 రూపాయి తగ్గించి
M O పంపితే - ఆ రూపాయికి వి.పి పోస్టులో
పంపుతాము -
దేవేంద్ర పబ్లిషర్స్ ఏలూరు రోడ్ విజయవాడ
నవరంగ్ పబ్లికేషన్స్ ఏలూరు రోడ్ విజయవాడ2
గోపీ

మెరిసిపోతూంది. అంతమందిలోనూ కొట్టవచ్చినట్టుగా కళకళ్ళాడుతూ కనపడుతూంది. అన్నపూర్ణమ్మగారు ఎదురింటి మహాలక్ష్మమ్మను పక్కకు పిలిచి—"ఎవ రా అమ్మాయి?" అని వాకబు చేశారు. మహాలక్ష్మమ్మగారి దగ్గర అందరి జాతక చక్రాలు, హిస్టరీలు ఉంటాయని అన్నపూర్ణమ్మగారికి తెలుసు.

"ఈ ఊరు కొత్తగా వచ్చారు. పిల్ల పేరు అపర్ణ. తండ్రి ప్రైమరీ స్కూల్లో టీచరు. చాలా బీదకుటుంబం. కాని, సంస్కారం, సభ్యత కల కుటుంబం. ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి అపర్ణ.. బి. ఎ. చదువుతూంది. పిల్లలందరూ చాలా చురుకైనవాళ్ళు. తెలివైనవాళ్ళు."

"అమ్మాయి అందంగా ఉంది కదూ?" అన్నపూర్ణమ్మ మనసులో మాట పైకి అనేసింది.

"అందం అంటావేమిటి ! అపరంజి బొమ్మ. నాకే కాని ఆ ఈడుకు తగ్గ కొడుకుంటే అపర్ణను కోడలుగా తెచ్చేసికొనేదాన్ని."

అన్నపూర్ణమ్మ ఆ తల్లీ కూతుళ్ళ దగ్గరికి వెళ్ళి పలకరించింది. పిల్లను దగ్గరికి తీసుకొంది. 'ఏం చదువుతున్నావు?' అని అడిగింది. ఆ పిల్ల తల్లి కాళ్ళకు పసుపు పారాణి ఒక్కసారి కాకుండా మూడుసార్లు రాసింది. వాళ్ళకు అందరికంటె ఎక్కువ సెనగలు, పళ్ళు, స్వీట్స్ వాయినం ఇచ్చింది.

• • •

దేవుళ్ళందరూ ఒక్కటే. మనుష్యులతో చెలగాటా లాడుతారు. అదేమిటో వాళ్ళకా సరదా. నీవే తప్ప నా కన్య శరణ్యం లేదని నిత్యం భగవన్నామ స్మరణ చేసిన వాళ్ళకే ఎక్కడలేని కష్టాలు. పూర్వ జన్మ సుకృతం అనుభవించక తప్పదు అని కొందరు, విధి అని కొంత మంది, దేవుడు మన సహనాన్ని పరీక్షిస్తున్నాడని మరి కొందరు—ఇలా ఎవరికి తోచిన విధంగా వారు సమాధానపరుచుకొంటూంటారు. ఆ గుడిలో దేవుడుమాత్రం ఏమీ ఎరగనట్టు ఎల్ల వేళలా నవ్వుతూ కూర్చుంటాడు.

• • •

"ఏమండీ! రవి పాస్‌పోర్టు వ్యవహారాలు ఎంత వరకూ వచ్చాయి?"

"అన్నీ అయిపోవచ్చాయి. ఒక నెల రోజుల్లో బయలుదేరటానికి సిద్ధంగా ఉండాలి."

"వెళితే మళ్ళీ ఎప్పుడు వస్తాడండీ?"

"ఎప్పుడయినా సెలవులకు రావచ్చు. కాని, కోర్సు అయిపోయేవరకు అక్కడ ఉంటేనే మంచిది."

"ఏమండీ! రవికి పెళ్ళి చేసేద్దామండీ."

"నీకేం మతి పోయిందా, అన్నపూర్ణా! ఒక్క నెల రోజుల్లో పెళ్ళి అయిపోతుందా? నీకు సరిపోయే కోడల్ని సెలక్టు చేసుకోవద్దా?"

"అప్పుడే సెలక్టు చేసేశాను. మీరు ఊఁ అంటే అన్ని పనులు చక చక అయిపోతాయి."

"ఇంతకూ ఆ అదృష్టవంతురా లెవరో?"

"అదృష్టం అమ్మాయిది కాదండీ. మనది. అమ్మాయిలో లక్ష్మీ కళ ఉట్టిపడుతూంది. ఆ అమ్మాయిని చూస్తే మీరు ఒక నెల వరకు కూడా ఆగరు. రేపే కోడలుగా తెచ్చేసుకొంటారు. అంత అందంగా ఉంటుంది."

తను సేకరించిన అపర్ణ వివరాలన్నీ భర్త గంగాధర శాస్త్రికి చెప్పింది అన్నపూర్ణమ్మ. తమ స్టేటస్‌కు సరితూగేవాళ్ళు కారే అన్న అనుమానం గంగాధర శాస్త్రికి కలిగినప్పటికి, అన్నపూర్ణ ఏ నిర్ణయం తీసుకొన్నా మంచీ చెడూ బాగా ఆలోచించే తీసుకొంటుందన్న నమ్మకంతో—

"పూర్ణా! ఇంటి విషయాలు నాకన్నా నీవే బాగా ఆలోచించి నిర్ణయించగలవు. నీ ఇష్టప్రకారమే కానియ్యి" అన్నారు.

• • • •

రవి, అపర్ణల వివాహానికి వందలాది బంధువులు, వేలాది మిత్రులు వచ్చారు. పెళ్ళి ఘనంగా జరిగింది. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఈడూ జోడూ ఎంతో చూడ ముచ్చటగా ఉన్నారని వచ్చిన వాళ్ళంతా తెగ మురిసిపోయారు.

"వదినా! అన్నపూర్ణమ్మ నిజంగా ఎంతో అదృష్టవంతురాలు. ఎంతో అదృష్టం చేసుకొంటేనేకాని ఇలాంటి కోడలు దొరకదు."

"నిజం సుమా! పెళ్ళికూతురు మొహంలో లక్ష్మీ కళ ఉట్టిపడుతూందంటే నమ్ము."

"అక్కయ్యా! అమ్మాయి అచ్చు బాపు బొమ్మలా ఉంది గదూ—పెద్ద కళ్ళూ అవీ?"

"అంత అందంగా ఉంది కాబట్టే అదృష్టం


రాన్‌బాక్సీవారి
గార్లిక్ పెర్ల్స్
సంపూర్ణారోగ్యానికి సహజ పద్ధతి

పచ్చి వెల్లుల్లి తినకూడదా ?



వెల్లుల్లి రసం శరీరంలో నిప చేయాలంటే పొట్టు తీసిన వెల్లుల్లిపాయలను బాగనమలాలి. నమిలితే నోరంతా పచ్చి వెల్లుల్లివాసన. నమల కుండా మింగితే అవి జీర్ణంకావటం కష్టం. అందులోని రసమంతా శరీరంలోకి రాదు.



వంటలో వెల్లుల్లివాడితే చాలదా?

వండటంతో వెల్లుల్లిలోని ఔషధ గుణాలు నశిస్తాయి.

వెల్లుల్లిలోని ఔషధగుణాలు అనాదినుండి తెలిసినవే. అన్నిరకాల అనారోగ్యాలను పోగొట్టటంలో వెల్లుల్లివిలువను వైద్యనిపుణులు గుర్తించారు. వెల్లుల్లిని వంట కాల్లో వాడవచ్చు. పచ్చి వెల్లుల్లి తినవచ్చు. కాప్స్యూల్ రూపంలో తీసుకోవచ్చు. అయినా సాధ్యమయినంతమేరకు వెల్లుల్లిలోని ఔషధగుణాలను పొందేందుకు దానిని గుణం కనబరిచేట్టువాడాలి

రాన్‌బాక్సీవారి గార్లిక్ పెర్ల్స్ ఎందుకు వాడాలి ?

రాన్‌బక్సీ పరిశోధన శాలలకు వైద్య ప్రపంచంలో మంచి పేరుంది. పచ్చి వెల్లుల్లిలోని సుగుణాలన్నీ వాసనలేకుండా మీకు లభించేట్టు తయారు చేశారు. శుద్ధమయిన పచ్చి వెల్లుల్లి రసంలో వాసన పోగొట్టి, సులభంగా జీర్ణమయ్యే మెత్తటి కాప్స్యూల్స్‌ను వెల్లుల్లిలోని ఔషధ గుణాలు ఉత్తమ పద్ధతిలో లభించేట్టు తయారు చేశారు.

రెండేసి గుళికలు రోజుకు రెండుసార్లు కమంతప్పకుండా తీసుకోండి.

రాన్‌బాక్సీవారి గార్లిక్ పెర్ల్స్
- ఉబ్బరము, అజీర్తి మాయమవుతాయి. గుండెలలో మంట తగ్గుతుది.
- కొలెస్టల్ స్థాయి తగ్గుతుంది.
- కీళ్ళనొప్పులు తగ్గుతాయి.
- తలచు జలుబు, దగ్గురాకుండా రక్షణ కలుగుతుంది.

రాన్‌బక్సీస్ గార్లిక్ పెర్ల్స్ ప్రతిరోజు సేవించండి
ఇది మంచి అలవాటు.




మీరు తెలుసుకోవలసిన కొన్నియదార్థాలు

asian/RGP3/80/TEL

ఆవిడ చుట్టూ తిరిగి ఎత్తి వీళ్ళింట్లో పడేసింది."

"పిన్నీ! పెళ్ళికూతురు పేద పిల్ల అయినా ఎంత హుందాగా ఉందో!"

"అవునే. అంత హుందాగా ఉన్నా, ఎక్కడా గర్వం లేదు. ఆ వినయం, ఆ విధేయత!"

"ఇదిగో, కోడళ్ళూ! ఇంత అందమయిన అమ్మాయిని ఎక్కడైనా చూశారా? ఆ పొడుగు, ఆ పొడుగుకు తగ్గ లావు, ఆ అవయవాల పొందిక, సన్నని నడుము, పెద్ద వాలు జడ, సంపెంగ మొగ్గ లాంటి ముక్కు, కలవ రేకుల్లాంటి కళ్ళు—అబ్బా అబ్బా! ఏం అందమే, బాబూ! నా జీవితంలో ఇదే మొదటిసారి, ఇదే ఆఖరిసారి ఇలాంటి అందాన్ని చూడడం."

"అత్తయ్యా! ఆ బుగ్గ క్రింద పుట్టుమచ్చ చూసేవూ? మా జాతకాల బాబాయి చెప్పేవాడు—ఆడ పిల్లకు బుగ్గ క్రింద పుట్టుమచ్చుంటే ఆ




MCA PDC/62/Tel

అమ్మాయి మొగుడితో హాయిగా, ఆనందంగా నూరేళ్ళు జీవితం గడుపుతుందని."

"తెలుస్తూనే ఉందిగా? బీద పిల్ల ఏమిటే, వీళ్ళింట్లో పడడమేమిటి?"

కొంత మంది ఆడవాళ్ళు ఉండబట్టలేక అన్న పూర్ణమ్మను కౌగలించేసుకొని తెగ పొగిడేశారు, అంత చక్కని కోడల్ని కొట్టేసినందుకు. వాళ్ళ నిజమైన పొగడ్తలకు అన్నపూర్ణమ్మ ఎంతో సంబరపడిపోయి, ఎవరూ చూడకుండా పెళ్ళికూతురికి దిష్టి తీసింది.

పెళ్ళికి వచ్చిన బంధువులందరికి—పెద్దవాళ్ళకు—మగవాళ్ళకు పంచెల చాపులు, ఆడవాళ్ళకు చీరెలు రవికెల గుడ్డలు, పసుపు కుంకుమ, మిఠాయి, కొబ్బరి కాయలు, చిన్న పిల్లలకు బట్టలు, అందరికి తిరుగు ప్రయాణానికి రైలు ఛార్జీలు ఇచ్చి పెళ్ళికి వచ్చిన వారినందరిని సగౌరవంగా మర్యాద చేశారు అన్నపూర్ణమ్మ, గంగాధర శాస్త్రి. పెళ్ళికి వచ్చిన ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా వధూవరులను నూరేళ్ళు హాయిగా, ఆనందంగా వర్ధిల్లమని ఆశీర్వదించి మరీ వెళ్ళారు.

* * * *

టెలిగ్రాం అందుకొన్న అన్నపూర్ణమ్మకు మూర్ఛపోయినంత పని అయింది. గంగాధర శాస్త్రికి ముచ్చెమటలు పోశాయి. ఆ దంపతు లిరువురూ తమ జీవితంలో పైవాళ్ళ కష్టాలను పంచుకోవటం, వాళ్ళకు తమ సానుభూతి చూపడమే తప్ప తమకై తాము ఇంతవరకూ కష్టాలను, దుఃఖాలను ఎదుర్కొనలేదు.


• • •

"పూర్ణా ! వియ్యంకుల వారిని సలహా అడుగు. అబ్బాయి రెండేళ్ళు అమెరికాలో బిజినెస్ మేనేజిమెంటు కోర్సు చేసి వచ్చాక శోభనం ఏర్పాటుచేస్తే బాగుంటుందేమో? ఇప్పుడే తొందర పడేకన్నా, ఈ రెండేళ్ళు అమ్మాయి అపర్ణ మన దగ్గరే ఉండి బి. ఎ. కంప్లీట్ చేస్తుంది."

• • •

శోభనం వాయిదా పడింది. వివాహం జరిగిన పదిహేను రోజుల్లో రవి అమెరికా వెళ్ళిపోయాడు. ఒక శుభదినాన అపర్ణ అత్తవారి ఇంటికి వచ్చేసింది. లక్ష్మీదేవిలా అపర్ణ ఇంట్లో తిరుగుతూంటే అన్నపూర్ణమ్మకు ఎంత ఆనందంగా ఉండేదో! ఎంత వద్దన్నప్పటికీ, అత్తగారికి ప్రతి పని లోనూ — పూజసామగ్రి అమర్చడం మొదలు వంటవరకు—అన్ని పనులలోనూ సాయం చేసేది అపర్ణ. "అమ్మాయీ ! నీవు వెళ్ళి చదువుకో...నేను చేసుకొంటాను" అని అన్నపూర్ణమ్మ చెపుతున్నప్పటికి సాయం చేస్తూనే ఉండేది అపర్ణ. మామగారు తనను ఎంతో అప్యాయతతో చూస్తున్నాట. జ్యోతి సరేసరి. తనను ఎప్పుడూ అంటిపెట్టుకొనే ఉంటుంది. ఇంటికి వచ్చిన ప్రతివాళ్ళకు కోడలు పిల్లను చూపి అన్నపూర్ణమ్మ ఎంతో మురిసి పోయేది.

ఇలాంటి ఆప్యాయత, అనురాగం, ఆదరణ లభించే కుటుంబంలోకి తను వస్తానని కలలో కూడా అనుకోలేదు అపర్ణ. తన అదృష్టానికి




సంబరపడిపోయేది అపర్ణ. అత్తవారి ఇంటికి వచ్చిన ఏ కోడలుకైనా ఇంతకన్నా కావలసిందేముంది? తను చేసిన పూర్వజన్మ సుకృతం ఎన్నోజన్మల నోముల పంట అని అనుకొనేది అపర్ణ.

• •

పిడుగులాంటి వార్త. వార్త లెప్పుడూ పిడుగుల్లానే ఉంటాయి. అలాంటి వార్తలు కార్డులు మొయ్యలేవు. ఆ బాధ్యత టెలిగ్రాములకే అప్ప చెప్పబడుతుంది. టెలిగ్రాం వచ్చిందంటే ఎంతటి ధీమాగల వారికైనా కాళ్ళు వణుకుతాయి. అందులోనూ ఆ టెలిగ్రాం తెచ్చేవాడు ఎర్ర సైకిల్‌తో వస్తాడు. ఆ ఎర్ర సైకిల్ ఒకొక్కప్పుడు గ్రీటింగ్స్ లాంటి శుభవార్తలు తెస్తున్నప్పటికి ఎక్కువగా దుర్వార్తలు మొయ్యడానికే అలవాటుపడింది. అలాంటి చెడు వార్తలను కాలయాపన లేకుండా త్వరగా అందచేసే టెలిగ్రాం డిపార్టుమెంటును ఎత్తివేస్తే బాగుంటుందేమో? అయితే ఆ డిపార్టుమెంటును ఎత్తివేసినంత మాత్రాన జరగవలసింది జరగక మానదుకదా?

• • •

"అన్నపూర్ణా ! అబ్బాయి ఉత్తరం వ్రాశాడు."

"ఏం వ్రాశాడండీ? క్షేమంగా ఉన్నాడా?"

మామగారి కేకవిని అత్తగారి వెనకాలే అపర్ణ వచ్చి తలుపు చాటున నక్కింది.

"క్షేమంగానే ఉన్నాడు. మొదటి ఏడాది పరీక్షల్లో అన్ని సబ్జెక్టులోనూ తనకే ఫస్టు వచ్చిందట. అందరు ప్రొఫెసర్లూ తనను ఎంతో మెచ్చుకొంటున్నారట."

"నాకు తెలుసు—మన రవి చాలా తెలివైనవాడు. తన చదువు తన పని తప్ప తక్కినవి అక్కర్లేదు. ఇంకేం రాశాడండీ?"

"అక్కడ చదువుతున్న చాలామంది ఇండియన్లు వాళ్ళు చదువైపోయాక తిరిగి ఇండియా వస్తే వాళ్ళ చదువుకు, హోదాకు తగ్గ ఉద్యోగం ఇక్కడ దొరకదని అక్కడే స్థిరపడిపోతున్నారట."

"కొంపతీసి మనవాడు కూడా అక్కడే ఉండిపోతానంటున్నాడా ఏమిటి?"

"లేదు. వాళ్ళంతా చేస్తున్నది తప్పు పని. తను ఆర్జించిన విజ్ఞానంవల్ల తన దేశానికి లాభం కలిగేటట్టుగా చదువు అయిపోగానే స్వదేశం తిరిగివచ్చి తన చదువుకు సార్థకత చేకూరుస్తానంటున్నాడు. ఇందా—ఉత్తరం అపర్ణకి ఇయ్యి."

• • •

ఎవరికైనా కష్టం కలిగితే మనం ధైర్యంగా సానుభూతి చూపిస్తాము. ధైర్యంగా ఉండమని బోధిస్తాము. అదే కష్టం మనకు వస్తే కళ్ళు తేలేస్తాము. పై వాళ్ళెవరికైనా అపాయం జరిగితే వింతగా చూస్తాము. అదే అపాయం మన దగ్గరి వాళ్ళకు జరిగితే తట్టుకోలేము. అపాయం అన్నది ఏక్సిడెంటల్. ముందు చెప్పిరాదు. ఎవర్ని వరిస్తుందో అసలే తెలియదు. ఒకొక్కప్పుడు మనకు తెలియకుండానే మన తప్పేమీ లేకుండానే మనం ఏక్సిడెంట్‌లో ఇరుక్కొంటాము. ఏక్సిడెంట్ చేసినవాడు హాయిగా బయటపడతాడు. ఇవే భగవంతుని లీలలయితే వాటికి అర్థం వెతకడం శుద్ధ దండుగ.

* * * *

రవి బిజినెస్ మేనేజమెంట్ కోర్సు పూర్తిచేసి అమెరికా నుండి తిరిగి వస్తున్నాడు. గంగాధర శాస్త్రి కుటుంబం యావత్తు బొంబాయి వెళ్ళారు, రవిని రిసీవ్ చేసుకోవటానికి. రవిలో ఎంతోమార్పు వచ్చింది. ఎంతో హుందాగా ఉన్నాడు. రెండేళ్ళ విదేశం చదువు అతన్ని పూర్తి మనిషిగా రూపు దిద్దింది. రవిని చూడగానే అందరిలో ఆనందం. తలి దండ్రులకు పాదాభివందనం చేశాడు రవి. అన్నపూర్ణమ్మకు, గంగాధర శాస్త్రికి ఏదో కొత్త అనుభూతి, ఆనందబాష్పాలు. కొడుకును లేవదీసి కౌగిలించుకొన్నారు. అపర్ణను పలకరించాడు. జ్యోతి,

శంకర్‌ల సంగతి చెప్పనే అక్కర్లేదు. రవిని వదల కుండా చెరొక రెక్క పట్టుకొన్నారు. ఆ కుటుం బాన్ని ఆ సమయంలో చూసిన వాళ్ళెవరైనా ఈర్ష్య పడక తప్పదు.

* * * *

ఒక ఆంగ్ల రచయిత — హెమింగ్వే అను కొంటాను ఒకసారి అన్నాడు — ఏదైనా కథలో పిస్టల్ ప్రస్తావన ఉన్నట్లయితే ఆ పిస్టల్ ఆ కథలో ఎక్కడో అక్కడ పేలవలసిందే. లేక పోతే పిస్టల్ ప్రస్తావన అనవసరమని. అలా అని నేను శ్రీ:లిగ్రాం సంగతి, ఏక్సిడెంట్ సంగతి రాశాను కదా—ఇంత మంచి పాత్రలను కొంపతీసి ఏదైనా ఏక్సిడెంట్‌లో ఇరికించేసి చంపేస్తాడేమిటి అని భయపడిపోతున్నారేమిటి? కథలో పిస్టల్ ఉన్నంతమాత్రాన అది పేలి నవసరం లేదు. కథ చివరలో పిస్టల్ తుస్సు మనవచ్చు. లేదా వంట ఇంట్లో పిల్లి తోసేసిన డబ్బా పిస్టల్ చేసిన శబ్దం చెయ్యవచ్చు.




daCunha/L.59 TL

రవి అమెరికాలో చదువుతున్నప్పుడే ఒక పెద్ద కంపెనీ వారు రవి ప్రతిభ గురించి తెలుసుకొన్నారు. విదేశం తిరిగి వచ్చిన నాలుగు రోజుల్లోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్సు వచ్చాయి. రెండు వేలు జీతం, కారు, బంగాళా సర్వెంట్సు.

తమ్ముడు శంకర్ ఎమ్. బి. బి. ఎస్. పూర్తి చేసి హౌస్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. స్వంత క్లినిక్ పెట్టి, బీద సాదలకు ఉచిత వైద్య సహాయం చెయ్యాలని ఆకాంక్ష. స్వంత ఖర్చుతో లేబొరేటరీ డెవలప్‌చేసి ఇంతవరకూ లొంగని వ్యాధులకు కొత్త మందులు, కొత్త ట్రీట్‌మెంట్లు రిసెర్చి చెయ్యాలని తపన. ఇద్దరు అన్నదమ్ములూ ఎవరికి ఎవరూ తీసిపోరు. ఇద్దరూ జాతీయతా భావం కలవారు. దేశాభ్యున్నతికి పాటు పడాలనే సదుద్దేశంతో జీవితంలో అడుగుపెట్టబోతున్నారు. చెల్లెలు జ్యోతి కూడా వీరి కేమీ తీసిపోదు. పి.యు.సి. ఫస్టు క్లాసులో పాసయింది. సమ్మర్ వెకేషన్ రెండు మాసాలు ఇంట్లో వయోజ విద్యాకేంద్రం ఒకటి స్థాపించి చదువురాని పెద్ద వాళ్ళకు చదువు చెప్పటం ప్రారంభించింది. ఆ ఇంట్లో ఉన్న అందరూ జాతీయతా, మానవతా భావాలు కలవారే. అలాంటి కుటుంబంలో ప్రవేశించిన అందాల అపర్ణ కూడా బి. ఎ. రాంకులో పాసయి, ఇల్లు చక్కదిద్దడంలో అత్తమామలకు సాయపడు తున్నది. ఇప్పుడు ఇంటి వ్యవహారాలన్నీ అపర్ణకే అప్పచెప్పబడినవి. గంగాధరశాస్త్రి, అన్నపూర్ణమ్మల జీవితం పరిపూర్ణత నొందింది.

● ● ●

ఏదైనా పక్వం చెందితేనే కాని, బద్దలు కాదు. పండైనా కానివ్వండి. పుండైనా కానివ్వండి.

* * * *

"నాయనా, రవీ! ఉద్యోగంలో ఎప్పుడు చేరాలి?" అన్నపూర్ణమ్మ గారు అడిగారు.

"వెంటనే జాయిన్ అవమన్నారు. పది, పది హేను రోజుల్లో బయలుదేరాలి."

"తాతయ్య నిన్ను, అపర్ణను చూడాలని ముచ్చట పడుతున్నారు. ఈ లోగా మీరిద్దరు తాతయ్య గారి ఊరు వెళ్ళి తాతయ్యను చూసి వచ్చెయ్యండి."

"అలాగే నమ్మా. రేపే వెళ్ళతాం."

* * ●

జరిగింది చూసేసరికి అపర్ణ మూర్ఛపోయింది అక్కడ చేరిన వాళ్ళు, వాళ్ళలో వాళ్ళు అనుకొం టున్నారు.

"ముందు నుండి వస్తున్న ఒక లారీ అడ్డంగా వస్తున్న ఒక కుక్కను తప్పించబోయి ఈ కారుని ముందు భాగంలో గుద్ది లారీ, కారు స్టక్ అప్ అయిపోయాయి. ఈ కుర్రాడు కారుకు ఏం డేమేజి జరిగిందో చూద్దామని కారు దిగి తన కారు ముందుకు వచ్చి చూస్తున్నాడు. ఆ అమ్మాయి కారులోనే కూర్చుంది. ఈ లోపల లారీ డ్రైవరు కారుతో లాకప్ అయిపోయిన తన లారీని కారు నుండి వేరు చెయ్యటానికి స్టార్టు చేశాడు. ఆ కుదుపుకి కారు స్టార్టు అయిపోయి ముందు నిలుచుని చూస్తున్న కుర్రవాడి మీద నుంచి వెళ్ళిపోయి అతని కారే అతన్ని చంపేసింది. లేడి భార్యలా ఉంది. కొత్త దంపతుల్లా ఉన్నారు పాపం! ఆ కుర్రవాడి మీద నుంచి వెళ్ళిపోతున్న కారులోనే తను కూర్చుని ఉంది."

అపర్ణలో చలనం లేదు. ఒక రాయిగా మారింది.

* ● ●

రివోల్టు అంటే బానిస దేశం గుర్తుకు వస్తుంది. నక్సలైట్లు గుర్తుకు వస్తారు. దోపిడి వ్యవస్థ గుర్తుకు వస్తుంది. మిలిటరీ జనరల్స్ గుర్తుకు వస్తారు. అయితే ఈ రివోల్టులన్నీ సర్వసాధారణంగా మనం చూస్తున్నవే. ఇందులో కొత్త ఏమీ లేదు. కాని, అనాదిగా వస్తున్న అర్థంలేని ఆచారాల మీద, మూఢ నమ్మకాల మీద రివోల్టు చెయ్యటం బహు కొద్దిమందికే చేతనవుతుంది. ఎందుచేతనంటే ఈ తిరుగుబాటు చేసే వారికి ఎంతో మనోధైర్యం ఉండాలి. లేకపోతే సంఘంలో ఏకాకులు అయిపోతారు. సంఘంచే వెలివెయ్యబడతారు. ఏ సంఘాన్నైతే ఉద్ధరించాలని వీరు రివోల్టు చేస్తారో అదే సంఘం వీరిని ఎత్తిపొడుస్తుంది. అందుకే సంఘాన్ని మరమత్తు చేసే వ్యక్తికి గట్స్ ఉండాలి.

* * ●

పది రోజుల తతంగం జరుగుతూంది. సానుభూతి చూపటానికి వచ్చిన బంధువులు, మిత్రులతో ఇల్లు నిండి ఉంది. యజ్ఞానికి బలి ఇవ్వటానికి తీసుకుని వెళ్ళే మాదిరి, అన్నపూర్ణమ్మ అపర్ణను ఆ తతంగం వద్దకు తీసుకొని వచ్చింది.

అక్కడ చేరిన ముత్తైదువులలో గుసగుసలు—

"ఒసే వదినా! నేను పెళ్ళిలోనే అనుకున్నాను— ఎక్కడో ఏదో లోపం ఉంది, వీళ్ళ దాంపత్యం మూడు చెక్కలూ నాలుగు ముక్కలూ అవుతుందని."

"ఎక్కడో లోపం కాదు. ఆడవాళ్ళకు నడుము క్రింద భాగంలో ఎడమ పక్క పుట్టుమచ్చ ఉంటే అంతకన్న దరిద్రం ఇంకొకటి ఉండదు."

"కాని, అక్కడేం పుట్టుమచ్చ ఉన్నట్టుగా లేదే!"

"ఉందిలే. ఉండకపోతే ఈ వైవిధ్యం ఎలా వస్తుంది?"

'ఇదిగో, విన్నావా, మరదలా? ఆ పిల్ల వేలు విడిచిన మేనత్త తమ్ముడి రెండవ కూతురుకు పెళ్ళయిన రెండో నెలల్లో మొగుడు పోయాడు. ఈ వైధవ్యం వాళ్ళ కుటుంబంలో ఆనవాయితీగా వస్తూంది.'

"అన్నపూర్ణ అందం చందం చూసి, పిల్ల ఎర్రగా, బుర్రగా ఉందని చేసేసుకొంది, కాని, వాళ్ళ కుటుంబం సంగతి కనుక్కోలేదు. వంశపారంపర్యంగా వస్తున్నది ఎక్కడికి పోతుంది?"

"ఇదిగో, అత్తయ్యా! పెళ్ళిలో నే నొక్కదాన్నే గమనించే! చూపుడువేలు, ఉంగరంవేలు సమానంగా ఉంటే కట్టుకొన్న మగవాడికి అరిష్టం." స్కేలు పెట్టి కొలిచినట్టుగా చెబుతూంది ఒక కోడలు.

గుసగుసలన్నీ అన్నపూర్ణమ్మ, గంగాధరశాస్త్రి ఉభయుల చెవుల వరకూ పాకుతున్నాయి. అన్నపూర్ణమ్మ దుఃఖాన్ని దిగమింగుతూ నిలుచుంది. గంగాధరశాస్త్రి గంభీరంగా నిలబడి అన్నీ వింటు న్నాడు.

"అన్నపూర్ణా!" ఉన్నట్టుండి ఒక గావుకేక పెట్టారు గంగాధరశాస్త్రి.

"అమ్మాయి అపర్ణను ఇలా తీసుకొని రా."

హాలులో ఒక్కసారి భయంకరమైన నిశ్శబ్దం. భర్త అరుపుకి అన్నపూర్ణమ్మ ఒక్క నిమిషం ఆశ్చర్యపోయినా, భర్త చెప్పిన విధంగా అపర్ణను భర్తవద్దకు తీసుకొని వచ్చింది.

గంగాధర శాస్త్రి ఈ సారి కూతురు జ్యోతిని పిలిచారు.



### పతిభక్తి

ఒక ఇల్లాలు భర్త అనారోగ్యం వల్ల ఆస్పత్రికి తీసుకు వెళ్ళింది. డాక్టరు అతనిని పరీక్షించి నిద్ర మాత్రలు ఇచ్చాడు.

డాక్టరు : ఇది వాడితే హాయిగా నిద్ర పడుతుంది. అతనికి విశ్రాంతి అవసరం.

భార్య: రోజూ ఎన్ని వాడమంటారు, డాక్టర్?

డాక్టరు : వాడవలసింది మీ ఆయనకు కాదమ్మా! నీవే రాత్రి పూట వాడితే ఆయన హాయిగా నిద్రపోతాడు.

---

"జ్యోతీ! వెళ్ళి కుంకుమ భరిణ పట్టుకొని రా."

జ్యోతి కుంకుమ భరిణ పట్టుకువచ్చింది.

"అన్నపూర్ణా! అమ్మాయి అపర్ణకు బొట్టు పెట్టు."

అన్నపూర్ణ రెండవసారి ఆశ్చర్యపోయింది. అయినా, భర్తపై అపూర్వమైన గౌరవం, విశ్వాసం ఉండటంచే కుంకుమ భరిణలో కుంకుమ తీసింది.

అపర్ణ ఒక అడుగు వెనక్కు వేసింది.

"అమ్మాయీ అపర్ణా! మాకు తెలుసు— పుత్రశోకం కన్న కట్టుకొన్న భర్త చనిపోయాడన్న విచారం భరింపరానిది. కాని, మనం నిమిత్తమాత్రులం. ఎప్పుడు, ఏం జరుగుతుందో ముందుగా తెలిస్తే మనుష్యులుగా ఉండము. జరుగుతున్నది, జరగబోయేది ధైర్యంగా స్వీకరించడం తప్ప మనమేమీ చెయ్యలేము. నువ్వు కంట తడిపెట్టకు. బొట్టు పెట్టించుకో. బొట్టు నీ పెళ్ళితో ప్రారంభం కాలేదు. నీ పుట్టుకతో ప్రారంభం అయింది. అది నీ జీవితాంతం ఉంటుంది. ఈ ఇంటికి లక్ష్మిలా వచ్చావు. ఇక ముందు కూడా లక్ష్మీదేవిలా ఉంటావు ఈ ఇంట్లో. అన్నపూర్ణా! అపర్ణకు బొట్టుపెట్టు."

అన్నపూర్ణ అపర్ణకు కుంకుమ బొట్టుపెట్టింది.

"అబ్బాయీ, శంకర్! ఇలా రా. అపర్ణ చెయ్యి అందుకో." ★